AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

26-10-2025

PAGES - 2



## లొంకలపల్లి శివారులో చిరుత కలకలం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నాగిరెడ్డి పేట బీట్ పరిధిలోని లొంకలపల్లి గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తున్నట్లు డీఆర్‌వో అరవింద్, బీట్ ఆఫీసర్ నవీన్ తెలిపారు. గ్రామ శివారులోని పంట పొలాల్లో చిరుత పులి అడుగుజాడలు కనిపించినట్లు స్థానికులు తెలిపారు. చిరుత సంచారంతో స్థానిక రైతులు, ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. చిరుత సంచరిస్తున్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామని బీట్ ఆఫీసర్ తెలిపారు. లొంకలపల్లి, నాగిరెడ్డిపేట, ధర్మారెడ్డి బొల్లారం బీట్ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పలువురు కానిస్టేబుళ్లకు పదోన్నతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న పలువురు కానిస్టేబుళ్లకు పోలీస్ శాఖ పదోన్నతి కల్పించింది. ఈ మేరకు సీపీ సాయిచైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. పదిమంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ కల్పించారు. పదోన్నతిపై వీరిని జగిత్యాల జిల్లాకు పంపించారు. ప్రమోషన్ పొందిన వారిలో కమ్మర్‌పల్లి పీఎస్ కానిస్టేబుల్ వరప్రసాద్, పీసీఆర్ పీసీ సీహెచ్.శేఖర్, భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌కానిస్టేబుల్ జి.శ్రీనివాస్, మాక్లూర్ ఠాణాకు చెందిన కె.యాదవ్, టూటౌన్ కానిస్టేబుల్ ఎండీ.ఆరీఫుద్దీన్, కోటగిరి పీఎస్‌కు చెందిన కె.చిన్నయ్య, నవీపేట ఠాణా కానిస్టేబుల్ డి.శ్రీనివాస్‌రావు, రెంజల్ పీఎస్‌కు చెందిన ఎల్.లింబాద్రి, ఓడీ కానిస్టేబుల్ పి.రాంచందర్, నిజామాబాద్ రూరల్ పీఎస్ కానిస్టేబుల్ పి.గణేశ్ ఉన్నారు. కాగా.. వీరు జగిత్యాల జిల్లాలో రిపోర్ట్ చేయనున్నారు. అనంతరం వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.



## బల్దియాల్లో పనులకు మోక్షం..



## వానరాల పనిపట్టేందుకు భల్లూకమొచ్చె..!

పెద్దకొడప్‌గల్ మండలంలోని కాటేపల్లి గ్రామంలో కోతుల బెడత తీవ్రమైంది. గ్రామంలో చిన్నాపెద్దా అందరిపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఇళ్లపైకి ఎక్కి పైకప్పులను ధ్వంసం చేస్తున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రామంలోని ఓ వ్యక్తి ఉపాయం ఆలోచించాడు. ఎలుగుబండి వేషధారణలో గ్రామంలో తిరుగుతు న్నాడు. దీంతో కోతులు పారిపోతున్నాయి. గ్రామస్థుడి ఉపాయంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్

మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు మోక్షం లభించనుంది. బల్దియాల్లో పనుల కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఒక్కో మున్సిపాలిటీకి రూ.15 కోట్లు కేటాయించింది. వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలో నిజాబాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొదటి సారిగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేయడం గమనార్హం. దీంతో అధికారులు పనులు చేపట్టడానికి సిద్ధం అవుతున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఒక్కో మున్సిపాలిటీకి రూ.15 కోట్లు
- వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఆదేశం

ఉమ్మడి జిల్లాలో నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలు ఉండగా.. ఇటీవల ప్రభుత్వం బిచ్కుందను సైతం బల్దియాగా ఏర్పాటు చేసింది. ఆయా మున్సిపాలిటీలకు నిధులు లేక ఏళ్లుగా అభివృద్ధి పనులు సాగడం లేదు. ముఖ్యంగా బిచ్కుంద మున్సిపాలిటీగా ఏర్పాటయినా.. కొత్తగా ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం బల్దియాలకు నిధులు విడుదల చేసింది. ఇప్పటికే అధికారులు పనుల నిమిత్తం ప్రతిపాదనలు పంపగా.. వాటిని ఆమోదించి నిధులు కేటాయించింది. ఈ మేరకు పట్టణాల్లో పనులను వేగంగా పూర్తి చేయడానికి టెండర్లు పిలవాలని ఆదేశించింది.

### వాటికి ప్రాధాన్యం

కొత్తగా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటివరకు మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదు. దాంతో బల్దియాల్లో ఎక్కడికక్కడ సమస్యలు తిష్టవేశాయి. పాలకవర్గాలు రద్దయినప్పటి నుంచి మున్సిపాలిటీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఇవన్నీ గుర్తించిన ప్రభుత్వం నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతో బల్దియాల్లో పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం లభించనుంది. ముఖ్యంగా తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరిచేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అలాగే పార్కుల అబివృద్ధితో పాటు మున్సిపాలిటీకి ఆదాయం లభించేలా షాపింగ్ కాంప్లెక్సులు నిర్మించడానికి నిధులు ఖర్చు చేయనున్నట్టుగా తెలుస్తోంది.

### నిధుల వివరాలివే..

ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్ కార్పొరేషన్‌తో పాటు 6 మున్సిపాలిటీలకు నిధులు విడుదల అయ్యాయి. కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున విడుదల అయినట్లు ఉత్తర్వులు వచ్చాయి. నిజామాబాద్ జిల్లాలో భీమ్‌గల్‌కు రూ.11.5 కోట్లు విడుదల చేయగా గతంలో ప్రతిపాదనలు పెట్టిన బీటీ రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీల పనులు చేపట్టనున్నారు. ఆర్మూర్ మున్సిపాలిటీకి రూ.15 కోట్లు విడుదల కాగా.. కాల్వల నిర్మాణం, రెండు విలీన గ్రామాలకు (పెర్కిట్, మామిడిపల్లి) పార్కులు, జంక్షన్ల ఏర్పాటు చేయనున్నారు.

### కామారెడ్డిపై అయోమయం

ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు నిధులు విడుదలైనట్లు ఉత్తర్వులు వచ్చాయి. అయితే కామారెడ్డి విషయంలో మాత్రం అయోమయం నెలకొంది. బల్దియాకు రూ.18.75 కోట్ల నిధులు కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే నిధుల విడుదలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ కాలేదని అధికారులు చెబుతున్నారు. ఆగస్టులో కురిసిన కుండపోత వానకు కామారెడ్డి పట్టణం ఆగమైంది. భారీగా ఆస్తి నష్టం జరిగింది. దీంతో ప్రత్యకంగా నిధులు కేటాయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందలేదు. అలాగే అభివృద్ధి పనులు కేటాయించిన నిధులపై కూడా ఇంకా ఉత్వర్వులు రాలేదని సమాచారం. కామారెడ్డికి రూ.15 కోట్లు కాకుండా ప్రత్యేక ప్యాకేజీ ద్వారానే నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తుందా.. ఇంకా ఏదైనా కారణాలు ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది.


## శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద..

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో అధికారులు ఆదివారం ఉదయం వరద గేట్లను మూసి వేశారు. ఎస్సారెస్పీలోకి నిన్నటి వరకు ఇన్‌ఫ్లో ఎక్కువగా రావడంతో అధికారులు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని విడుదల చేశారు. అయితే ఇన్‌ఫ్లో తగ్గడంతో ఆదివారం గేట్లను మూసివేశారు. జలాశయంలోకి ప్రస్తుతం 9,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 4 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేలు, సరస్వతి కాలువకు 650, లక్ష్మి కాలువకు 200, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 80.5 టీఎంసీలతో నిండుకుండలా ఉంది.

### నిజాంసాగర్ ప్రాజెక్టులోకి..

**ఎల్లారెడ్డి :** నిజాంసాగర్ ప్రాజెక్ట్ లోకి స్వల్ప ఇన్ ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి 5,760 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు ఒక గేటు ఎత్తి 5,497 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరుంది.

## ఏఎస్సై సురేష్‌కు ఉత్తమ రచన పురస్కారం



**అక్షరటుడే, మెండోరా:** ముప్కాల్ మండల కేంద్రంలో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ప్రముఖ రచయిత తొగర్ల సురేష్‌కు ఉత్తమ రచన పురస్కారం దక్కింది. శ్రీవాణి సాహిత్య పరిషత్ సిద్దిపేట ఆధ్వర్యంలో వచ్చే నవంబర్‌లో తొగర్ల సురేష్‌కు ఉత్తమ రచన పురస్కారం అందజేయనున్నారు. సురేష్ రాసిన 'వెన్నెల్లో మా పల్లె' పుస్తకానికి అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ముప్కాల్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కట్ట మహేష్ యాదవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఏఎస్సై సురేష్ మరెన్నో పుస్తకాలను రచించి ప్రముఖుల స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కాగా.. 'వెన్నెల్లో మా పల్లె' పుస్తకంలో సురేష్ తను చిన్నప్పుడు నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్ గ్రామంలో విద్యనభ్యసించిన జ్ఞాపకాలను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. ఈ పుస్తకానికి ఉత్తమ రచన పురస్కారం లభించడంపై కుటుంబీకులు, సహోద్యోగులు, బంధువులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



## ఆర్మూర్‌లో పోలీసుల సైకిల్ ర్యాలీ

**అక్షరటుడే, ఆర్మూర్:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆర్మూర్ ఠాణా పరిధిలో పోలీసులకు వివిధ పోటీలు నిర్వహించారు. అంతకుముందు పెర్కిట్ బస్టాండ్ నుంచి ఆర్మూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వరకు ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు పెట్టారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆత్మగౌరవం కోసమే జాగృతి పోరాటం: కవిత

**అక్షరటుడే, ఇందూరు:** అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తెలంగాణ జాగృతి పనిచేస్తుందని సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. జనం బాటకు విశేష స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. నవీపేట మండలం యంచ గ్రామంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముందుకు రావాలన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అలసత్వం వల్ల క్వింటాలుకు రూ.700 నష్టం వాటిల్లిందన్నారు. అలాగే మక్కకు కూడా కనీస మద్దతు ఇస్తామని చెప్పినా.. ఇవ్వడం లేదన్నారు. జిల్లాలో కొనసాగుతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జిల కోసం, అలాగే బీసీ బిల్లు కోసం ఎంపీ అర్వింద్ రాజీనామా చేయాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముందో.. ప్రధాని మోదీ ఇంటి ముందో ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఎంపీ అర్వింద్‌తో సహా ఎనిమిది మంది ఎంపీలంతా కలిసి రాజీనామా చేస్తే బీసీ రిజర్వేషన్ బిల్లు నడుచుకుంటూ వస్తుందని ఆమె జోస్యం చెప్పారు. గతంలో ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ తనను కే టాక్స్ అనేవాడని, మరి ఇప్పుడు ఏం టాక్స్ వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వట్లేదన్నారు. కాంట్రాక్టర్లకు డబ్బులు ఇస్తున్నారని.. కానీ విద్యార్థుల భవిష్యత్తు పట్టదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో మైనారిటీ శాఖకు మంత్రి లేని మొట్టమొదటి ప్రభుత్వం ఇదేనని కవిత వ్యాఖ్యానించారు. అన్ని వర్గాలకు ఆత్మగౌరం లేకుండా పోయిందన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలతో తమకు సంబంధం లేదని, తాము ఏ పార్టీకి మద్దతు ఇవ్వడం లేదన్నారు. జూబ్లీహిల్స్‌లోని తమ క్యాడర్ వారి ఇష్ట ప్రకారం ఎవరికైనా ఓట్లు వేయొచ్చు అని అన్నారు.

## 'మన్ కీ బాత్'ను వీక్షించిన అర్బన్ ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఇందూరు:** ప్రధాని నరేంద్ర మోదీ 127వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆదివారం తన కార్యాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశాభివృద్ధి దిశగా తీసుకుంటున్న ప్రగతిశీల నిర్ణయాలను ప్రధాని ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. ఐదేళ్ల తర్వాత భారత్ – చైనా మధ్య విమాన సేవలు పునరుద్ధరించడం కారణంగా వాణిజ్యం పెరుగుతుందన్నారు. పర్యాటక రంగం పెరిగి సత్సంబంధాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్రధాని మన్ కీ బాత్ దేశ ప్రజల్లో జాతీయతాభావం సేవ స్ఫూర్తి పర్యావరణ చైతన్యాన్ని పెంపొందిస్తుందని చెప్పారు.





## విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**అక్షరటుడే, గాంధారి:** విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతుల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. గాంధారి మండల కేంద్రంలో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. గాంధారి మండల కేంద్రంలో ముందుగా ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్మించిన కొత్త మరుగుదొడ్లను ప్రారంభించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సొంత నిధులు రూ.9 లక్షలు కేటాయించారు. అంతేకాకుండా అదే పాఠశాలలో ఆగ్మెంటెడ్, వర్చువల్ రియాలిటీ ల్యాబ్, కొత్త కంప్యూటర్ ల్యాబ్‌ను కూడా ప్రారంభించారు. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు సాంకేతిక విద్యలో మరింత అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. తర్వాత రూ.12లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేట్ మేనేజ్ మెంట్ నిర్వహణలో కొనసాగుతున్న ఎయిడెడ్ పాఠశాలలు ఆదరణ కోల్పోతున్నాయి. ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గడం.. ఉపాధ్యాయులు అంతంతగానే ఉండడంతో బడులు మూత పడుతున్నాయి. ప్రధానంగా మేనేజ్ మెంట్‌తో పాటు ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టకపోవడమే ఆదరణ తగ్గడానికి కారణం అవుతోంది.

- అక్షరటుడే, ఇందూరు




# ఎయిడెడ్‌కు ఆదరణ కరువు..!

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు తక్కువగా ఉండడం, ఉన్నా వాటిపై సరైన అభిప్రాయం లేకపోవడంతో కొన్ని స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు ముందుకు రావడంతో ఎయిడెడ్ పాఠశాలలు నెలకొల్పారు. ప్రభుత్వ సహకారంతో ప్రైవేట్ మేనేజ్ మెంట్ అజమాయిషీలో పాఠశాలలు కొనసాగేలా అనుమతించారు. దీంతో ప్రభుత్వం ఎయిడెడ్ ఉపాధ్యాయులను నియమించి జీతభత్యాలు అందజేస్తోంది. అలాగే గతంలో పాఠశాలలకు కావాల్సిన గ్రాంట్లు కూడా విడుదల చేసేది. కానీ ప్రస్తుతం ఎయిడెడ్ పాఠశాలల పరిస్థితి దారుణంగా తయారైంది. మేనేజ్ మెంట్లు ప్రైవేటు స్కూళ్లను తెరవడంతో వీటిపై దృష్టి సరైన సాధించలేకపోతున్నారు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడం, సౌకర్యాలను పెంచడంతో ఎయిడెడ్‌పై అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

జిల్లాలో మొత్తం 28 ఎయిడెడ్ స్కూళ్లు ఉన్నాయి. ఇందులో 17 ప్రాథమిక, 11 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం సుమారు 7వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. కొన్ని బడుల్లో వందకు మించి విద్యార్థులు లేరు. కొన్ని పాఠశాలల్లో 200 వరకు విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఉపాధ్యాయులు కూడా ఒక్కొక్కరిగా పదవీ విరమణ చేయడంతో ఒకరిద్దరితో పాఠశాలలను కొనసాగిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ప్రైవేటు ఉపాధ్యాయులను నియమించి బోధిస్తున్నారు. కానీ ఎక్కువ శాతం.. ఉన్న వారితోనే నడిపిస్తున్నారు. దీంతో విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

### కమిటీల అవినీతి...

ఎయిడెడ్ పాఠశాలలను కుల, స్వచ్ఛంద సంస్థలు మేనేజ్‌మెంట్ చేస్తాయి. అయితే గతంలో పలు పాఠశాలలు అవినీతికి పాల్పడడం, ఉపాధ్యాయుల మీద పెత్తనం చెలాయించడం, తదితర అంశాలు ప్రభుత్వం దృష్టికి వచ్చాయి. దీంతో వాటికి గ్రాంట్లు కూడా నిలిపివేశాయి. అలాగే ప్రభుత్వ బడులు బలోపేతం చేయడంతో ఎయిడెడ్ స్కూళ్లపై దృష్టి సారించడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోనైతే కొన్ని పాఠశాలల్లో ఒక్క ఉపాధ్యాయుడితో నెట్టుకొస్తున్నారు.

### ఉపాధ్యాయులకు లేని పదోన్నతి..

ఎయిడెడ్ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ప్రభుత్వం నుంచి జీతభత్యాలు పొందుతారు. 2004 నుంచి ఎయిడెడ్ టీచర్ల రిక్రూట్ మెంట్ కూడా నిలిపేశారు. అలాగే 2013-14 తర్వాత వారికి పదోన్నతులు కూడా కల్పించడం లేదు. దీంతో ఉపాధ్యాయులు అదే క్యాడర్‌లో పదవీ విరమణ పొందుతున్నారు. ఈ అంశంపై ఉపాధ్యాయ సంఘాలు పలుమార్లు ప్రభుత్వాలకు వినతిపత్రం సమర్పించినా.. లాభం లేకుండాపోయింది. అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు నష్టపోవడం యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చివరికి ఎయిడెడ్ బడులు మూతబడే పరిస్థితులు ఏర్పడ్డాయి.



## కాంగ్రెస్ పార్టీలో చేరిక

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సదాశివనగర్‌కు చెందిన సుమారు 70 మంది బీజేపీ కార్యకర్తలు ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేస్తున్న కృషి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి.. ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కలిసికట్టుగా ముందుకు వెళ్దామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ వర్సిటీ కబడ్డీ టోర్నీకి విద్యార్థిని ఎంపిక




**అక్షరటుడే, ఆర్మూర్:** ఇంటర్ వర్సిటీ కబడ్డీ టోర్నీకి పట్టణంలోని సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రిక పేర్కొన్నారు. కళాశాలలో ఎంపీసీఎస్ సెకండియర్ విద్యార్థిని ఉమాభారతి ఈనెల 29 నుంచి నవంబర్ 2 వరకు చెన్నైలో జరిగే ఇంటర్ వర్సిటీ కబడ్డీ టోర్నీలో పాల్గొననుందన్నారు. టోర్నీకి ఎంపికైన విద్యార్థినిని అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## స్కూల్ భవనాన్ని ప్రారంభించనున్న ఎంపీ సురేష్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** మక్లూర్ మండల కేంద్రంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా ఆధ్వర్యంలో హైస్కూల్ భవన నిర్మాణం పూర్తయింది. ఈ మేరకు నూతన హైస్కూల్ భవనాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి ప్రారంభించనున్నట్లు రైల్వే బోర్డు డైరెక్టర్ బొడ్డు గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

## పేకాట స్థావరంపై దాడి

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** పేకాడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అంజని గ్రామంలో శనివారం అర్ధరాత్రి పేకాడుతున్నట్లుగా పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12,750, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## భార్యను హతమార్చిన కేసులో భర్తకు రిమాండ్

**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని విఠల్‌వాడి తండాకు చెందిన పవర్ సవితను ఆమె భర్త గురువారం రాత్రి రోకలిబండతో కొట్టి హత్య చేశాడు. ఈ ఘటనకు సంబంధించి ఆదివారం పవర్ కిషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

## నూతన విద్యా విధానంపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి




**అక్షరటుడే, కామారెడ్డి:** వచ్చే డిసెంబర్ నాటికి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తెలంగాణ నూతన విద్యా విధానాన్ని ప్రకటిస్తామని చెప్పడాన్ని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి ఖండించారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా నూతన విద్యా విధానాన్ని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ప్రకటన చేసేముందు సంఘాలతో చర్చించాలన్నారు. కామారెడ్డి పట్టణంలో ఆదివారం పీఆర్టీయూ జిల్లా కమిటీ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రైమరీ పాఠశాలలను బలోపేతం చేయకుండా ఉన్నత పాఠశాలలు బలోపేతం కావన్నారు. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు ఉపాధ్యాయ సంఘాలకు తెలుసని, సంఘాల నాయకులతో చర్చించకుండా నూతన విద్యా విధానంపై ప్రకటన చేయవద్దని ప్రభుత్వాన్ని కోరారు. 73 ఏళ్ల చరిత్రలో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు ఇప్పటికీ నేలపై కూర్చుని చదువుకునే పరిస్థితులు ఉన్నాయని దామోదర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బడులు బాగుంటే ఉపాధ్యాయులు బాగుంటారని, ఉపాధ్యాయులు బాగుంటే విద్య బాగుంటుందని, తద్వారా దేశం బాగుంటుందని పేర్కొన్నారు. విద్యావ్యవస్థ బలోపేతం కోసం పీఆర్టీయూ కంకణం కట్టుకుందని దామోదర్ రెడ్డి తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తించేలా పీఆర్టీయూ కృషి చేస్తుందన్నారు. ఉద్యోగుల హెల్త్ స్కీం విధానం చివరి దశలో ఉందని తెలిపారు. పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సదాశివుడు, రవికిరణ్, రాష్ట్ర కార్యదర్శులుగా లక్ష్మణ్, రవీందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నారాయణను నియమించినట్లు ప్రకటించారు. అనంతరం వారితో ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుషాల్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిక్షం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి వివిధ మండలాల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** పట్టణంలో ఆదివారం శ్రీ రేణుక ఎల్లమ్మ పరివారం, చింతల పోచమ్మ, ధ్వజస్థంభ ప్రతిష్ఠాపనోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. వేద పండితుల మంత్రాలు.. ప్రదోష పూజలు నడుమ రేణుక ఎల్లమ్మ విగ్రహం, ధ్వజ స్థంభాన్ని ప్రతిష్ఠించారు. యజ్ఞం, బలి, పూర్ణాహుతి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం గ్రామ దేవతలైన ముత్యాల పోచ్చమ్మ, నల్ల పోచ్చమ్మ బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




**పెద్దకొడప్‌గల్ మండలంలో మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తలాబ్‌తండా గేట్ వద్ద మిషన్ భగీరథ నీరు లీకవుతోంది. ఇక్కడి నుంచి పోచారం గ్రామ పంచాయతీలోని రామారావు తండాకు పైపులైన్ ద్వారా నీళ్లు సరఫరా అవుతుంటాయి. కానీ కొన్ని నెలల నుంచి నీటి లీకేజీ వల్ల రామారావు తండాకు సైతం పూర్తిస్థాయిలో నీరందడం లేదు. అధికారులు స్పందించి వెంటనే లీకేజీ సమస్యను పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు. - అక్షరటుడే,పెద్ద కొడప్‌గల్**

## ఇళ్ల కేటాయింపులో పేదలకు అన్యాయం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి వి ప్రభాకర్ అన్నారు. మండలంలోని అంకాపూర్‌లో ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హులను గుర్తించి, జాబితాలో పేర్లు తొలగించారని ఆరోపించారు. నిర్మాణ దశలోనే గ్రామంలో సర్వే చేసి 299 మంది పేర్లతో జాబితా తయారు చేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పేర్లను లిస్టు నుంచి తొలగించిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు కేటాయించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో నలుగురికి ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బి దేవా రాములు, మండల సంయుక్త కార్యదర్శి బి కిషన్, నిఖిల్, పోశెట్టి, భోజమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## పీఏసీఎస్ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పీఏసీఎస్ కార్యదర్శిపై చర్యలు తీసకోవాలని కోరుతూ తాండూర్ సింగిల్ విండో సొసైటీ డైరెక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీసీవో రామ్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం డైరెక్టర్లు బాబురావు, సిద్ధిరాంరెడ్డి మాట్లాడుతూ.. డైరెక్టర్లుగా ఉన్న తమకు ఎలాంటి సమాచారం లేకుండా.. నోటీసులు ఇవ్వకుండా తొలగించి.. కార్యదర్శి తమను అవమానపర్చారన్నారు. తాము సొసైటీలో ఎలాంటి అప్పులు చేయలేదని.. పైగా సొసైటీకి ప్యాడీక్లీనర్ యంత్రాలు కొనడానికి డబ్బులు సైతం అందించామని పేర్కొన్నారు. అకారణంగా తమను డైరెక్టర్లుగా తొలగించారని కారణమైన పీఎసీఎస్ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వారంరోజుల్లో విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని డీసీవో హామీ ఇచ్చినట్లు డైరెక్టర్లు తెలిపారు.



## రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** ధాన్యంకొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు నూతల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మోర్తాడ్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. వారం రోజుల నుంచి రైతులు ధాన్యం ఆరబెడుతున్నారని, పీఏసీఎస్ నిర్వాహకులు హమాలీలు లేరని చెప్పడం బాధాకరమన్నారు. తూకాలు వేగవంతం చేయాలని కోరారు. తూకాలు వేసిన ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు పంపాలని కోరారు. రైతులకు 48 గంటల్లో రబీ బోనస్‌తో పాటు ఈ ఖరీఫ్ బోనస్‌ను కూడా రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గంగారెడ్డి, చిన్నారెడ్డి, మామిడి గంగారెడ్డి, చాపల్ రెడ్డి, మహిళా రైతులు ఉన్నారు.



## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** తడిసిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ మండలం చేపూరు గ్రామ బైపాస్ రోడ్డు వద్ద పోసిన వరికుప్పలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించి కేంద్రానికి తెచ్చినా.. ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్నారు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయన్నారు. కోతలు పూర్తయి రోజులు గడుస్తున్నా.. తూకాలు ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు. రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలు పెంచి ధాన్యం మిల్లులకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, తరుగు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి భూమన్న, ఆర్మూర్ మండల నాయకులు శేపూరు సాయన్న, రైతులు ఆర్ చిన్నారెడ్డి, ఆర్ అఖిల్, డి సాయి కృష్ణ, ప్రవీణ్, రఘుపతి, పెర్కిట్ సొసైటీ మాజీ చైర్మన్ డి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.